క్లుప్తంగా

మంత్రి పొంగులేటి పరామర్శ

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కోనాయిగూడెం గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యులను శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని ఆర్థిక సాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, అంజిని, నాగరాజు, శ్రీనివాసరావు, నరేష్, విజయ్‌బాబు ఉన్నారు. అలాగే, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సైతం పరామర్శించగా.. శాఖమూరి రమేష్, నాయకులు గోవిందరావు, అంజిని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన ముందస్తుగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వంటగదిని, భోజనాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల ఎస్ఓ అజితకుమారి, ఏఎన్ఎంలు సునీత, సరిత పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నేలకొండపల్లి: ఆస్పత్రిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు మాట్లాడుతూ.. గత మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని, ఇకనైనా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హీరాలాల్, ఎస్‌కె.సైదావలీ, సాయిరామ్, సజాత, వీరకుమారి, వెంకటలక్ష్మి, కౌసల్య, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

కూసుమంచి: మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో నానో యూరియా వినియోగంపై శుక్రవారం ఏఓ వాణి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాధారణ యూరియాతో పోల్చితే నానో యూరియాలో 45 శాతం ఎక్కువ నత్రజని సామర్థ్యం ఉంటుందన్నారు. నానో యూరియాను పిచికారీ చేసి మొక్కలకు నేరుగా నత్రజని అందించవచ్చని, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని వివరించారు. పలువురు రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం: మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం చర్చి కంపౌండ్ ప్రాంతానికి చెందిన మేడేపల్లి జయరాజ్ తన మోటార్‌సైకిల్‌పై ఖమ్మం వైపు నుంచి దమ్మాయిగూడెం వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో తిరుమలాయపాలెం సమీపానికి రాగానే వెనక నుంచి గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో జయరాజ్‌కు తీవ్రగాయాలు కాగా పోలీసులు 108లో ఖమ్మంకు తరలించారు.

బియ్యం వితరణ



బియ్యం వితరణ చేస్తున్న యూత్ సభ్యులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీ పాటివారిగూడెంలో అశుభకార్యాలకు గ్రామ యూత్ సభ్యులు తరఫున 50 కేజీల బియ్యాన్ని అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమాన ఇటీవల గ్రామానికి చెందిన గుండమాల ఏసు మృతిచెందగా ఆయన దశదిన కర్మకు శుక్రవారం 50 కేజీల బియ్యాన్ని ఆయన కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పిడతల రాము, దాసరి అశోక్, కుమ్మరి భీమరాజు, దోమల రవిందర్, కోళ్లపుడి నాగేంద్ర, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

తిరుమలాయపాలెం: మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నీరుడు లాజరస్ మాతృమూర్తి, కాంగ్రెస్ నాయకురాలు నీరుడు సాయమ్మ(95) అనారోగ్యంతో మృతిచెందడంతో శుక్రవారం పలు పార్టీల నేతలు నివాళులర్పించారు. మాలమహానాడు నేతలు, కాంగ్రెస్ నాయకులు వీరభద్రం, ఇజ్రాయిల్, రాజశేఖర్, కనకరాజు, గంగాధర్, కొప్పుల అశోక్ తదితరులు నివాళులర్పించారు.

ఏడి పనులు ఆడనే..



మధ్యగేటు వద్ద నిలిచిపోయిన నిర్మాణం

నత్తనడకన మోహన్ రోడ్డు నిర్మాణ పనులు

- నిధులు మంజూరైనా పురోగతి శూన్యం
- సరైన రోడ్డు లేక ప్రజల అవస్థలు
- ఇళ్లు కోల్పోయిన వారికి నేటికీ పూర్తిగా అందని పరిహారం
- 8 నెలలుగా ఎదురుచూపులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ వెంకటగిరి వంతెన నుంచి మధ్య గేటు వరకు ఉన్న మోహన్ రోడ్డు నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నిధులు మంజూరైన పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. రైల్వే మూడో లైన్ ఏర్పాటులో భాగంగా పనులు చేపట్టగా.. రోడ్డు వెంట ఉన్న ఇళ్లు, వ్యాపార దుకాణాలను తొలగించి నిబంధనల మేరకు రైల్వే శాఖ పరిహారం అందించింది. అంతేకాక నూతన రహదారి నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేసింది.

40 అడుగుల వెడల్పుతో..

రైల్వే శాఖ విడుదల చేసిన నిధులతో 40 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం, డ్రెయిన్లు, పైప్ లైన్లు, విద్యుత్ ఏర్పాటు వంటి పనులకు సుమారు కిలో మీటరు వరకు రూ. 3.03 కోట్లు ఖమ్మం మున్సిపల్ శాఖ కేటాయించింది. అయితే రైల్వే శాఖ మూడో లైను పనులను పూర్తి చేసుకోగా రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయి. 2024 డిసెంబర్ 12న రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి 8 నెలలు కావొస్తున్నా పురోగతి కనిపించడం లేదు.

రహదారి లేక అవస్థలు

వెంకటగిరి వంతెన నుంచి మధ్యగేటు, గాంధీచౌక్, సుందర్ టాకీస్ రోడ్డు, వర్తక సంఘం, కమాన్ బజార్, కస్పాబజార్‌లు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. త్రీటౌన్‌లోని శ్రీనివాస్‌నగర్, ప్రకాష్‌నగర్, గుట్టల బజార్, జహీర్‌పుర ప్రాంతాల వారు, ఖమ్మం పరిసర మండలాలు, ఇతర ప్రాంతాల వారు వివిధ అవసరాల నిమిత్తం వస్తుండగా.. మోహన్ రోడ్డు సౌకర్యవంతంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అందని పూర్తి పరిహారం..

మోహన్ రోడ్డు పొడవునా 32, 36వ డివిజన్లలో ఉన్న ఇళ్లకు ఒక్కో గజానికి సుమారు రూ.లక్ష వరకు మంజూరు చేసింది. ఇందులో వెంకటగిరి వంతెన నుంచి నర్తకి థియేటర్, ఐరన్ సిండికేట్ వరకు 10 గజాల పొడవుతో ఇళ్లు, దుకాణాలు కోల్పోగా.. అక్కడ నుంచి మధ్య గేటు వరకు సుమారు 20 గజాల వరకు కోల్పోయాయి. ఈనేపథ్యాన ప్రభుత్వం సుమారుగా 10 గజాల పొడవు చొప్పున పరిహారం చెల్లించింది. అయితే అంతకు మించి కోల్పాయిన వారు తమకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రైల్వే శాఖ నిధులు మంజూరు చేసినా.. స్థానిక ప్రభుత్వ శాఖలు అందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



అధ్వానంగా మారిన మోహన్ రోడ్డు

త్వరగా పూర్తి చేయాలి..



రైల్వే శాఖ నిధులు మంజూరు చేసినా మోహన్ రోడ్డు, డ్రెయిన్లు, ఇతర నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో వివిధ అవసరాల కోసం ఈ రోడ్డు మార్గాన వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి.

– వీవీ సుబ్బారావు, గుట్టలబజార్

పట్టింపు కరువు..



రైల్వే శాఖ మూడో లైన్ నిర్మాణంలో భాగంగా నష్ట పరిహారం అందించినా పనులు ముందుకు సాగడం లేదు. మోహన్ రోడ్డు వినియోగంలో లేక వ్యాపారస్తులు, వినియోగదారులు కొన్ని నెలలుగా ఇబ్బంది పడుతున్నారు. అధికారుల పట్టింపు లేకపోవడంతో పనుల్లో పురోగతి మందగించింది.

– జంగిలి రమణ, త్రీటౌన్‌వాసి

ప్రభుత్వ శాఖలు స్పందించాలి



36వ డివిజన్‌లో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారు పూర్తిస్థాయి పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. పరిహారం చెల్లిస్తే పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌ను అభ్యర్థిస్తూనే ఉన్నాం. ఇకనైనా ప్రభుత్వ శాఖలు స్పందించాలి.

– పసుమర్తి రామ్మోహన్‌రావు, 36వ డివిజన్ కార్పొరేటర్

జిల్లాకు చేరిన సాగు న్యాయయాత్ర



పాలేరులో రైతులతో మాట్లాడుతున్న సునీల్

కూసుమంచి: భూమి హక్కులపై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యాన లీఫ్స్ సంస్థ సహకారంతో చేపట్టిన సాగు న్యాయ యాత్ర శుక్రవారం సూర్యాపేట జిల్లా మీదుగా ఖమ్మం జిల్లాకు చేరింది. దీనిలో భాగంగా మండలంలోని నాయకన్‌గూడెం, పాలేరు, కూసుమంచి గ్రామాల్లో పర్యటించి ప్రముఖ భూ చట్టాల తయారీ నిపుణుడు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ భూమి హక్కులపరంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా రూపొందించిన భూమాత చట్టం ద్వారి కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. గత నెల 28 మొదలైన ఈ యాత్ర అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందని, ఈమేరకు 8 వేల గ్రామాలను సందర్శిస్తూ 10వేల మంది రైతులను ప్రత్యక్షంగా కలిసి వ్యవసాయ, భూమి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో కమిషన్ చైర్మన్ ఓఎస్‌డీ శ్రీహరి వెంకటప్రసాద్, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్, అభిలాష్, మల్లేష్, రవి, ప్రవీణ్, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, ఏఓ వాణి, ఆర్‌ఐ జ్యోతి, ఏఈఓలు పాల్గొన్నారు.

కేటీఆర్ పరామర్శ



పువ్వాడ నాగేశ్వరరావు యోగక్షేమాలు తెలుసుకుంటున్న కేటీఆర్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఖమ్మం పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అలాగే ఇటీవల మృతిచెందిన వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని నగరంలోని కవిరాజ్‌నగర్‌లో కలిసి పరామర్శించి మదన్‌లాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన భార్యతో మాట్లాడి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ చంద్రావతి, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నేతలు కొండబాల కోటేశ్వరరావు, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి..

నేలకొండపల్లి: డిప్యూటీ సీఎం భట్టి, జిల్లా మంత్రులపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, గుండా బ్రహ్మం, నరేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ విధానాలే నచ్చకే జిల్లాలో అత్యధిక స్థానాల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు.

బొడ్రాయి వద్ద సారె సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారికి సారె సమర్పణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం భక్తులు మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి సారె సమర్పించారు. వీరికి ఇదొక ఆచారం కావడంతో ముందుగా గ్రామ దేవతలు బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లులకు సారె సమర్పించాక రఘునాథపాలెంలోని శ్రీ గర్భరక్షాంబిక సహిత గాయత్రి అమ్మవారికి సారె అందజేశారు. ఆలయ అర్చకులు తొటం వేణు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ శీలం శ్రీను, గోపి, కాలువ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11కేవీ మైసమ్మ గుడి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు (శనివారం) ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏడీ యాదగిరి తెలిపారు. దీంతో వీఆర్‌కే సిల్క్స్ వెనక, వరదయ్యనగర్, మమత ఆస్పత్రి రోడ్డు నుంచి ట్యాంక్‌బండ్ వరకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం



కోర్టును ప్రారంభిస్తున్న యాజమాన్యం

ఖమ్మంస్పోర్ట్స్: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ కోర్టును శుక్రవారం హార్వెస్ట్ గ్రూపు విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యూమర్ తొలగింపు



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్

ఖమ్మం మామిళ్లగూడెం: మైక్రో సర్జరీ ద్వారా ఓ మహిళకు ట్యూమర్ తొలగించినట్లు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ కె.ఎస్.కిరణ్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మానికి చెందిన టి.అరుణ గత నెల రోజులుగా మెడ, కాళ్లు, చేతుల నొప్పులతో పాటు తలనొప్పి, వాంతులతో యశోద ఆస్పత్రిలో చేరిందన్నారు. ఇది చాలా అరుదైన ట్యూమర్ అని, దీన్ని నాడి నుంచి తొలగించడానికి అత్యాధునిక కలర్ డాప్లర్, ఇంట్రా ఆపరేటివ్, ఎంఆర్‌ఐను ఉపయోగించి శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సిబ్బంది చంద్రశేఖర్, పేషంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న దండి సురేష్

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 19, 20 తేదీల్లో మధిరలో సీపీఐ జిల్లా మహాసభలు జరగనున్నాయని, ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ, మండల మహాసభలను పూర్తి చేసుకుని మధిరలో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. రైతాంగ, కార్మిక, మహిళ, యువత, విద్యార్థి సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని తదనుగుణంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె.జానీమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై ఇరువైపులా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఖమ్మం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బిడ్జిపై లైట్లు లేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, వెంకటగిరి బ్రిడ్జిపై లైట్లు వెలిగించాలని, విద్యాలయాల ఎదుట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం త్రీటౌన్ కార్యదర్శివర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు, షేక్ సైదులు, బండారు యాకయ్య, వీరబాబు, హిమామ్, శీలం వీరబాబు, శ్రీనివాసరావు, పాపారావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్ కలెక్టర్లను ఆదుకోవాలి

ఖమ్మంవ్యవసాయం: పీసు రేటు విధానంలో పనిచేస్తున్న విద్యుత్ బిల్ కలెక్టర్లకు కనీస వేతనం చెల్లించి ఆదుకోవాలని స్తంభాద్రి ఎలక్ట్రిసిటీ మ్యూచువల్లి ఎయిడెడ్ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం ఖమ్మంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంతో తమకు కనీస ఉపాధి లభించడం లేదన్నారు. జిల్లాలో 48 మంది బిల్ కలెక్టర్లు పీసు రేటుపై పనిచేస్తున్నారని, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కృష్ణయ్య, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

నేలకొండపల్లి: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్‌గా మండలంలోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన మాదాసు శ్రీనివాసరావు నియమితులయ్యారు. శుక్రవారం రాయగూడెం గ్రామానికి చెందిన తీగ రాములును రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులు పోటీచేయనున్న నేపథ్యాన త్వరలోనే కమిటీలు ఏర్పాటు చేసి జేఏసీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. నాయకులు తీగ రాములు, ఎం.వెంకటేశ్వరావు, కె.వెంకటనారాయణ, కె.వెంకటరెడ్డి, మల్లికార్జున్, జె.కృష్ణ, జి.నాగమణి పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటాలు

తిరుమలాయపాలెం: రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం పోరాటాలు సాగించి ఆదివాసీలకు అండగా నిలబడాలని అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరాల శ్రీకాంత్ అన్నారు. శనివారం ఇల్లెందు పట్టణంలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో విస్తృత ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మతోన్మాద మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో ప్రజా సంపదను దోచిపెట్టి పనిలో నిమగ్నమైందని విమర్శించారు. ప్రజా,కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తుందని, దేశ సంపాదన కొల్ల గొట్టడానికి చట్టాలను సవరిస్తూ అనేక కుట్రలు చేస్తుందని ఇందులో భాగంగానే మిలిటరీ బలగాలతో ఆదివాసీలను హతమార్చుతున్నారని చెప్పారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. నాయకులు గొర్రెపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం ఎన్నెస్పీ హైస్కూల్, నయాబజార్ హైస్కూల్, ఇందిరానగర్ హైస్కూల్ ఎదుట విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఖమ్మం టౌన్ ప్రధాన కార్యదర్శి యశ్వంత్, నాయకులు అశోక్, శ్రీను, స్టాలిన్‌లు మాట్లాడుతూ.. పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేరని,మూత్ర శాలలు, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా, కంప్యూటర్ ల్యాబ్‌లు లేని పాఠశాలలు చాలా ఉన్నాయన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పట్టింపు లేకుండా బడిబాట కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ప్రణవ్, అనిల్, రహీమ్, దినేష్, కల్యాణ్, అరవింద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ, మాజీ మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 19న ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంగణంలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ధూంధాం కార్యక్రమ పోస్టర్లను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలతో పాటుగా విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్‌పుటం పురుషోత్తమరావు, రాష్ట్ర కోశాధికారి కంచె సత్యనారాయణ, మెట్టు శ్రీనివాస్, ఆకుల రజిత్‌కుమార్, జగన్మోహన్, స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్ కుమార్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాజేష్, నాయకులు రాకేష్ దత్త, గణేష్ గౌడ్, మధు తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

బ్రిడ్జి.. జరభద్రం!



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

మండలంలోని సుబ్లేడు-మరిపెడ రహదారిలో పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న కల్వర్టు గతేడాది వచ్చిన వరదలతో కొట్టుకుపోయింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మూలమలుపు వద్ద బ్రిడ్జి ఉండడంతో కొత్తగా వచ్చేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో హెచ్చరిక బోర్డులు లేక రఘునాథపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు అందులో పడి ప్రాణాలు కోల్పోగా.. మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకోకుండా అధికారులు తాత్కాలిక రెయిలింగ్, రేడియం స్టిక్కర్లు అంటించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– తిరుమలాయపాలెం